ఒకే ఒక్కటి

- ఆరు మండలాలకు ఒక్కటే అగ్నిమాపక కేంద్రం
- 120 కి.మీ పరిధిలో సేవలు - సిబ్బంది అంతంతమాత్రం
- మరో రెండు కేంద్రాలు అవసరం



తాళ్లవలసలోని చిట్టివలస అగ్నిమాపక కేంద్రం



అగ్నిమాపక శకటం

గంటల బండి మోగుతూ వెళ్తే ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగిందో అని గుండెల్లో గుబులు రేగుతుంది. వేసవి వస్తే ఆ ప్రమాదాల సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుంది. ఆ సమయంలో ప్రతీ క్షణం అమూల్యమే. ఆలస్యమయ్యే కొద్దీ నష్టం పెరుగుతూ ఉంటుంది. అయితే, నియోజకవర్గం మొత్తానికి ఒక్కటే ఉన్న చిట్టివలస అగ్నిమాపక కేంద్రానికి దూరమే భారమవుతోంది. రెండు నియోజకవర్గాలు.. 120 కి.మీ విస్తృత పరిధికి మరి రెండు అగ్నిమాపక కేంద్రాల ఆవశ్యకత ఉంది.

తగరపువలస: చిట్టివలస అగ్నిమాపక కేంద్రం ఒక్కటే భీమిలి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి ఆరు మండలాల్లో సుమారు 120 కిలోమీటర్ల పరిధిలో సేవలు అందిస్తోంది. అగ్నిమాపక కేంద్రం నలుదిక్కులా వందకు పైగా గ్రామ పంచాయతీలు, 8 జీవీఎంసీ వార్డుల్లో ఎప్పుడు, ఎక్కడ ఏ అగ్నిప్రమాదం జరిగినా పరుగులు తీస్తోంది. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శకటంతో పాటు ద్విచక్రవాహనం, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నా సిబ్బంది కొరత వేధిస్తోంది. పరిధి కూడా ఎక్కువగా ఉండటంతో మధురవాడ, భోగాపురం కేంద్రంగా మరో రెండు అగ్నిమాపక కేంద్రాల అవసరం ఉంది.

పూర్వం చిట్టివలస జ్యూట్‌మిల్లు రన్నింగ్‌లో ఉన్నప్పుడు కేవలం అక్కడ ప్రమాదాల నివారణ కోసమే ఈ కేంద్రాన్ని మిల్లు ఆవరణలో ఏర్పాటు చేశారు. అప్పట్లో మిల్లు యాజమాన్యమే ఈ కేంద్రానికి వసతి సమకూర్చింది. మిల్లు మూసివేత తరువాత ఈ అగ్నిమాపక కేంద్రం భీమిలి మండలం తాళ్లవలస జాతీయరహదారి పక్కన సొంత వసతి సమకూర్చుకోగలిగింది. ప్రస్తుతం ఈ అగ్నిమాపక కేంద్రం సేవలు దివీస్ లేబొరేటరీ, భీమిలి మండలంలోని దాకమర్రి, ఆనందపురం మండలంలోని వెల్లంకిలో పదుల సంఖ్యలో ప్లై-వుడ్ ఫ్యాక్టరీలు, భీమిలి, ఆనందపురంలో సీ ఫుడ్స్ సంస్థలు, మూడు మెడికల్ కళాశాలలు, 220 వరకు ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్, డెంటల్ కళాశాలలు, పెట్రోల్ బంకులు, బొగ్గు బట్టీలు, పోలీస్ స్టేషన్లు, బెటాలియన్లు, కల్యాణ మండపాలు, ఆలయాలు, నర్సింగ్‌హోమ్‌లు, కర్రల మిల్లులు, ఆరు సినిమా థియేటర్లు, వందల సంఖ్యలో దుకాణాలు, షాపింగ్ మాల్స్‌కు అందుబాటులో ఉన్నాయి.

గత రెండేళ్లలో భారీ ప్రమాదాలు

2024-25 సంవత్సరంలో ఇప్పటి వరకు 50కు పైగా చిన్నా, చితక అగ్నిప్రమాదాలు జరిగాయి.

- ఈ నెల 11న వెల్లంకి ఆజాద్ వీటీసీ ప్రైవేట్ లిమిటెడ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.1.50 కోట్ల విలువైన రోబోట్లు కాలిపోయాయి.
- 2023 నవంబరు 26న తగరపువలస మెయిన్ రోడ్డులోని జశ్వంత్ రెడీమేడ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.5.60 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ ప్రమాద నివారణకు చిట్టివలస అగ్నిమాపక కేంద్రానికి తోడుగా విశాఖ, విజయనగరాల నుంచి నాలుగు శకటాలు తెల్లవార్లు శ్రమించవలసి వచ్చింది.

మంటల్లో కాలిపోతున్న జశ్వంత్ రెడీమేడ్స్ (ఫైల్)





అగ్నిమాపక ద్విచక్రవాహనం



అగ్నిమాపక కేంద్రం ముందు రెయిలింగ్‌తో మూసి ఉన్న జాతీయరహదారి

ఆపద వేళ త్వరగా వెళ్లే దారేది?

అగ్నిమాపక కేంద్రం నుంచి జాతీయ రహదారి మీదకు చేరుకునేందుకు అవకాశం లేకుండా రెయిలింగ్‌తో మూసి ఉన్న కారణంగా సర్వీస్‌రోడ్డులో చుట్టూ తిరిగి రావలసి ఉంటుంది. ప్రమాదాల నివారణకు త్వరగా చేరుకునేందుకు గాను కేంద్రం ముందు తాత్కాలికంగా రెయిలింగ్ తెరచి, మూసి వేయడానికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

దూరం.. ఆపై భారం..

చిట్టివలస అగ్నిమాపక కేంద్రం నుంచి పద్మనాభం మండల కేంద్రంవైపు 13 కి.మీ., భోగాపురం దాటిన తరువాత నాతవలస వరకు 20, బీచ్‌రోడ్డులో తిమ్మాపురం వైపు 20, ఆనందపురం మండలంలోని గండిగుండం వైపు 20, కొమ్మాది వైపు 14, డెంకాడ మండలంలోని జొన్నాడ వైపు 13 కిలోమీటర్లు, దివీస్ వైపు 12 కాకుండా మిగిలిన ప్రాంతాల వైపు కూడా పరుగులు తీయవలసి ఉంటుంది. ప్రస్తుతం కాపులుప్పాడ, ముడసర్లోవ, సింహాచలంలలో కొత్తగా అగ్నిమాపక కేంద్రాల నిర్మాణానికి స్థల కేటాయింపు జరిగింది.

మూడు పోస్టులు ఖాళీ

చిట్టివలస అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక శాఖాధికారి-01, లీడింగ్ ఫైర్‌మెన్-03, డ్రైవర్ ఆపరేటర్-03 పూర్తి స్థాయిలో ఉన్నారు. 9 మంది ఫైర్‌మెన్‌కు గాను ఇద్దరు హోంగార్డులతో కలిసి ఆరుగురు ఉండగా, మూడు ఖాళీలు ఉన్నాయి.

ప్రమాదాలు ఎదుర్కొనేందుకు సిద్ధం

కేవలం అగ్నిప్రమాదాలే కాకుండా ఎక్కడైనా విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇటీవల గంభీరం రిజర్వాయర్‌లో వరసగా జరుగుతున్న ప్రమాదాల సమయంలోనూ మా సిబ్బంది హాజరవుతున్నారు.

– జి.శ్రీనివాసరావు,
అగ్నిమాపక శాఖాధికారి, చిట్టివలస (తాళ్లవలస)

క్లుప్తంగా

శ్రద్ధగా చదువుకుంటే సత్ఫలితాలు



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: విదార్థినులందరూ తమ పాఠ్యాంశాలను శ్రద్ధగా అభ్యసిస్తే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా బాలికా శిశు అభివృద్ధి అధికారి డాక్టర్ కలీషా బేగం అన్నారు. భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6,7,8 తరగతుల విద్యార్థినులకు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్ట్‌లలో నైపుణ్యం ఎలా ఉందన్న దానిపై సోమవారం పరీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షల ఫలితాలను బట్టి ఎవరి నైపుణ్యం ఎలా ఉందని అంచనా వేస్తామన్నారు. దాని ప్రకారం తొమ్మిది, పది పరీక్షలకు ఏ విధంగా చదవాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అర్థమవుతుందన్నారు. దానిప్రకారం అందరూ మరింత బాగా చదువుకోవాలని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థినులు ఎంతో ఏకాగ్రతతో చదవాలని సూచించారు. అప్పుడే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



రహదారి భద్రతపై మాట్లాడుతున్న సీఐ సాయి

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్‌బీటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. మధురవాడ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ సాయి, ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ఆనందపురం సీఐ చింతల వాసునాయుడు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలు, శిక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, మేనేజర్ పి.ఎస్.రాజు, పీవో హరగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎఫ్‌సీలో ఆహార తనిఖీలు



తనిఖీ నిమిత్తం సేకరిస్తున్న రసమలై స్వీట్ శాంపిల్

బీచ్‌రోడ్డు: పలువురు ఆహార ప్రియులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమ్మాది టీఎఫ్‌సీలో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలిలా.. కొమ్మాది జంక్షన్‌లోని ట్రీట్స్ ఫుడ్ కోర్ట్(టీఎఫ్‌సీ)లో పాడైన స్వీట్లు విక్రయిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి ఆనంద్‌ను తనిఖీల నిమిత్తం టీఎఫ్‌సీకి పంపించారు. అక్కడ ఆయన రసమలై స్వీట్ శాంపిల్‌ను సేకరించారు. దీనిని నాణ్యత పరీక్షల నిమిత్తం ఆహార పరీక్షల కేంద్రానికి పంపారు. నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని నందాజీ పేర్కొన్నారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట



పంప్‌హౌస్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు వలందపేట సంప్ కమ్ పంప్‌హౌస్ వద్ద తాగునీటి వృథాకు సిబ్బంది అడ్డుకట్ట వేశారు. ఇక్కడ నీరు పోతుండటంతో 'తాగునీరు వృథా' శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు సిబ్బంది స్పందించారు. వాల్వ్ వద్ద స్ప్రింగ్ లూజ్ కావడంతో నీరు లీక్ అవుతున్నట్లు గుర్తించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి కొత్తది తీసుకువచ్చి సరిచేశారు.

రాధాకృష్ణులకు కుంభాభిషేకం

కనులపండువగా విగ్రహా ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు



పండ్లు, పవిత్ర నదీజలాలతో రాధాకృష్ణులను అభిషేకిస్తున్న అర్చకులు



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీరాధాకృష్ణుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు కనులపండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజు, సోమవారం సాయంత్రం కుంభాభిషేకం జరిగింది. వేద మంత్రాల నడుమ గంగ, యమున, గోదావరి, సరస్వతి, సింధు, కావేరి తదితర పవిత్ర నదులకు చెందిన 108 పవిత్ర జలకలశాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, పంచగవ్యాలు, వివిధ పుష్పాలతో వైభవంగా ఈ అభిషేకాలు జరిగాయి. ఉదయం భక్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వగురువు శ్రీల భక్తి వేదాంత స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పద్మశ్రీ మధు పండిత దాసచే విగ్రహ ప్రతిష్ఠా మూర్తులు శ్రీరాధాకృష్ణులకు శ్రీరాధా మదన్‌మోహన్ స్వామిగా నామకరణం చేశారు. చివరిగా శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూర్ జయంతి నిర్వహించి, హారతి ఇచ్చారు. భక్తులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు మధు పండిత దాస, హరేకృష్ణ మూవ్‌మెంట్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస, బెంగళూర్ ఇస్కాన్ వైస్ ప్రెసిడెంట్ వాసుదేవ కేశవప్రభు, ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ చంద్రోదయ మందిర ఉపాధ్యక్షుడు యధిష్టర కృష్ణదాస, అహ్మదాబాద్ అధ్యక్షుడు జగన్‌మోహన్ కృష్ణదాస, విజయవాడ అధ్యక్షుడు వంశీధర దాస, విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తదితరులు పాల్గొన్నారు. మంగళవారం శ్రీరాధా మదన్ మోహన్ స్వామి ప్రథమ దర్శనంలో భక్తులు పాల్గొనాలని స్థానిక ప్రతినిధులు అంబరీష దాస, యదురాజ దాస కోరారు.

అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

భీమునిపట్నం: తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ భీమిలిలోని శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకురాలు పి.మణి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెరగకపోవడం వల్ల వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరకుల ధరలు రోజు రోజుకు తీవ్రంగా పెరిగిపోతున్నాయని, దీంతో పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయని అన్నారు. వీరికి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ప్రీస్కూళ్లను బలోపేతం చేయడంతో పాటు, సాయంత్రం పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఆర్.వెంకటలక్ష్మి, మూడు మండలాల వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ - జీవీ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రభూషణరావు

పీఎం పాలెం: ఇంజినీరింగ్ విద్యార్థులు టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని జేఎన్‌టీయూ - జీవీ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రభూషణరావు అన్నారు. బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో 'సాంకేతిక- సాంస్కృతిక ఫెస్ట్'ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకుని విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు అంతకు మించి శ్రద్ధ వహించాలని సూచించారు. కాలేజీ కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ 5 రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్ అనేక విషయాలు నేర్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ జీఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ రావు తదితరులు ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులకు గాయాలు

భీమునిపట్నం: భీమిలిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు గాయపడ్డారు. ఒక ప్రైవేట్ బీఎడ్ కళాశాలలో చదువుతున్న సవర సుజాత, పాంగి శ్రావణి బీచ్ రోడ్డులోని బీసీ బాలికల వసతి గృహంలో ఉంటున్నారు. వీరు తమ వసతి గృహానికి నడిచి వెళుతుండగా జిల్లా పరిషత్ అతిథి గృహం సమీపంలో ద్విచక్రవాహనంపై వెనుక నుంచి వాసుపల్లి హరీష్ అనే వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువతులకు గట్టి దెబ్బలు తగిలాయి. వారిని కేజీహెచ్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొమ్మాది సిగ్నల్ వద్ద నిలిచిన కంటైనర్

గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం



కొమ్మాది జంక్షన్‌లో రోడ్డుకు అడ్డంగా ఆగిపోయిన కంటైనర్

మధురవాడ: కొమ్మాది జంక్షన్ వద్ద ఓ కంటైనర్ నిలిచిపోవడంతో సోమవారం మధ్యాహ్నం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మారికవలస వద్ద ఉన్న ఓ రొయ్యల కంపెనీకి చెందిన భారీ కంటైనర్ మారికవలస వలస వైపు నుంచి వచ్చి కొమ్మాది జంక్షన్ మీదుగా రొయ్యల కంపెనీకి వెళ్లేందుకు సిగ్నల్ వద్ద మలుపు తిప్పే క్రమంలో మధురవాడ వైపు వెళ్లే రోడ్డుకు అడ్డుగా ఆగిపోయింది. దీంతో మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. బండి కదిలే స్థితిలో లేకపోవడంతో డ్రైవర్ పరారయ్యాడు. గంట తర్వాత ఆ రొయ్యల కంపెనీకి చెందిన సిబ్బంది వచ్చి దీనిని తీసుకువెళ్లారు. ట్రాఫిక్ సీఐ సాయి ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవస్థలు పడ్డారు. సదరు వాహనానికి డేంజరస్ డ్రైవింగ్ నేరంపై రూ.2 వేలు పెనాల్టీ విధించినట్లు సీఐ సాయి తెలిపారు.

రీజనల్ పీఎఫ్ కమిషనర్‌కు కార్మికుల వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో మారుపేరు కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ మిల్లు ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు మద్రిపాలెంలోని పీఎఫ్ కార్యాలయంలో రీజనల్ పీఎఫ్ కమిషనర్ జాస్తి పవన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్‌లో మార్చుకోవడానికి ఢిల్లీలోని పీఎఫ్ కార్యాలయం హెడ్‌ఆఫీసు నుంచి ఉత్తర్వులు వచ్చిన విషయం గుర్తుచేశారు. మిల్లు యాజమాన్యం పీఎఫ్ చెల్లించడానికి లైన్ క్లియర్ చేయాలని కోరామన్నారు. రీజనల్ పీఎఫ్ కమిషనర్‌ను కలిసిన వారిలో దల్లి అప్పలరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాంబాబు, రాజు తదితరులున్నారు.

సకాలంలో పని చేస్తేనే ప్రయోజనం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



నిర్వాహకులతో చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: చేయవలసిన కార్యం సకాలంలో చేయకుండా తరువాత ఎప్పుడో చేయడం వలన ప్రయోజనం ఉండదని స్వామి హనుమ చెప్పిన మాటలు చాల గొప్పవని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనంలో వివరించారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాల్లో భాగంగా సోమవారం కిష్కింధకాండపై ఆయన ప్రవచించారు. వర్షాకాలం దాటి శరత్కాలం వచ్చిన తరువాత సీతాన్వేషణ ప్రారంభిద్దామని శ్రీరాముడు చెప్పారన్నారు. వర్షాకాలమును వాల్మీకి మహర్షి ఎంతో అందంగా వర్ణించిన పద్ధతిని తెలియజేశారు. వాలి మరణం, సుగ్రీవుని కిష్కింధకు రాజును చేయడం, అంగదుని యువరాజుగా ప్రకటించడాన్ని వివరించారు. శరత్కాలం ప్రారంభమైనా సీతాన్వేషణ ప్రారంభించాలన్న విషయాన్ని మరిచిపోయి, భోగాలు అనుభవిస్తున్న సుగ్రీవుని వద్దకు స్వామి హనుమ వచ్చి, తాను చేయవలసిన కార్యమును చేయవలసిన సమయానికే చేయవలెనని, లేకపోతే ప్రయోజనం సిద్ధించదని హిత వచనములు పలికారన్నారు. అప్పుడు సుగ్రీవుడు నీలుడిని పిలిచి అన్ని దిక్కులయందు ఉన్న వానరములు, భల్లూకములు అన్నీ 15 రోజులలోపు తన వద్ద హాజరు కావాలని ఆజ్ఞ జారీ చేశారని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడకు తక్షణ వైద్యం

సాక్షి ఎఫెక్ట్..



సంగివలసలో దూడకు వైద్యం అందిస్తున్న పశువైద్య సిబ్బంది

తగరపువలస: అనారోగ్యంతో ఉన్న ఆవుదూడకు పశువైద్య సిబ్బంది తక్షణ వైద్యం అందించారు. సంగివలసలోని రైతు అక్కరమాని మంగరాజు దూడ ఒకటి నెల రోజులుగా చర్మంపై బొడిపెలతో బాధపడుతోంది. సంచార వైద్యశాల సిబ్బందిని సంప్రదించినా సరైన చికిత్స అందలేదు, మందులు ఇవ్వలేదు. సంచార పశు వైద్యశాలకు ఫోన్ చేసినా వైద్యం అందడం లేదని పాడిరైతులు వాపోవడంతో ''నియోజకవర్గంలో అటకెక్కిన పశువైద్యం' శీర్షికతో సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై పశు సంవర్ధకశాఖ భీమిలి సహాయ సంచాలకుడు డాక్టర్ బి.వెంకటరమణ స్పందించారు. సిబ్బందితో పాడిరైతు అక్కరమాని మంగరాజు పశువుల దొడ్డికి వెళ్లి జరిగిన విషయంపై విచారణ నిర్వహించారు. అక్కడున్న ఆవుదూడ లంపీ స్కిన్ వ్యాధితో బాధ పడుతున్నట్టు గుర్తించి, తక్షణం వైద్యం అందించారు. ఐదురోజుల పాటు చికిత్స అందించడానికి అంగీకరించి రైతుకు మందులు అందించారు. సంచార పశువైద్యశాల సిబ్బంది సకాలంలో స్పందించి అవసరమైన మందులు అందించాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పశు వైద్యశాలల్లో మందుల కొరత లేదన్నారు. అన్నివేళల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఇకపై కూడా సక్రమంగా సేవలు అందిస్తామన్నారు.

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా అధికారులు

- 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ
- మూడో బ్యాచ్ యాన్యువల్ రిఫ్రెష్‌మెంట్ కోర్సు ప్రారంభం



ప్రసంగిస్తున్న మురళీకృష్ణ



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పీఎం పాలెం: నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరివరామంగా సేవలందించే పోలీస్ సిబ్బంది, అధికారుల కుటుంబాలకు పోలీస్ ఉన్నతాధికారులు అండగా ఉంటారని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. బక్కన్నపాలెంలోని ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో మూడో బ్యాచ్ యాన్యువల్ రిఫ్రెష్‌మెంట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బందికి రెండు వారాల పాటు ఈ కోర్సు ఏర్పాటు చేశామన్నారు. బేసిక్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఈ కోర్సు ద్వారా నెమరువేసుకోవచ్చన్నారు. అందులో భాగంగా ఉదయం పీటీ అండ్ స్ట్రెంథెనింగ్, రెండో సెషన్‌లో మిషన్ వెపన్స్ ట్రైనింగ్ పునశ్చరణ ఉంటుందని చెప్పారు. సిబ్బంది ఒకేచోట ఉండిపోకుండా వేర్వేరు పోస్టులకు మారడానికి ఈ కోర్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.